# నమస్తే తెలంగాణ
## మహబూబ్‌నగర్
### నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శనివారం 17 ఆగస్టు 2024 MAHABUBNAGAR NARAYANPET





పాలమూరు వీరన్నపేట చౌడేశ్వరి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు, కమలం పూలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

## వరలక్ష్మీ నమోస్తుతే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శ్రావణశోభ సంతరించుకున్నది. వరలక్ష్మీ.. నమోస్తుతే అంటూ మహిళలు అమ్మవారిని కొలిచారు. రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. పాలమూరు బ్రాహ్మణ వాడిలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కోల్‌కతా నుంచి తీసుకొచ్చిన 1,600 కమలం పూలతో అలంకరించారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## వందశాతం లక్ష్యాలను సాధించాలి

- జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం బ్యాంకర్లు వంద శాతం లక్ష్యాలను సాధించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తిలోని కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2016 తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో సాగునీటి లభ్యత పెరిగి వ్యవసాయంతోపాటు రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. జిల్లాలో రుణమాఫీ ద్వారా రూ.400 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,454.92 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంగా ఉండగా, జూన్ నాటికి రూ.324 కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా విద్యా, గృహ నిర్మాణ రంగాలకు రూ.3,961 కోట్ల రుణ లక్ష్యానికి కేవలం రూ.386 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. పంట రుణాలతోపాటు రుణ సదుపాయం ఉన్న రంగాలపై యువతకు అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొన్నారు.

***బ్యాంకుల ఆక్షేపణలు తగదు..***

కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూములకు కొన్ని బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంపై ప్రశ్నించారు. పంట రుణాలు తీసుకునేందుకు బ్యాంకుల ఆక్షేపణ సరికాదన్నారు. మహిళా సంఘాలు రుణాలు తీసుకునే క్రమంలో డిపాజిట్, సేవింగ్ కింద అగ్రిమెంట్ చేసుకోవడం సరికాదని చెప్పారు. కలెక్టరేట్‌తోపాటు సమీకృత మార్కెట్ యార్డుల్లో ఏటీఎంలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్షలో నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి, ఏపీజీవీబీ ఆర్ఎం రంజిత్‌కుమార్, డీఏవో సుధాకర్‌రెడ్డి, ఎల్‌డీఎం కౌశల్ కుమార్ పాండే, యూనియన్ బ్యాంక్ ఏజీఎం మురళి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

## దుండగులను ఉరి తీయాలి

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, ఆగస్టు 16 : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీవీ మెడికల్ కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనకు నిరసనగా మెడికోలు ధర్నా చేపట్టారు. శుక్రవారం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లో వైద్య విద్యార్థులు తరగతులు బహిష్కరించి జిల్లా దవాఖానల ఎదుట ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్ధరాత్రి రాక్షసుల్లా హత్యాచారానికి ఒడిగట్టిన దుండగులను ఉరితీయాలన్నారు. ఇప్పటికైనా మహిళలందరూ మేల్కోవాలని, రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.



వనపర్తి జిల్లా వీపనగండ్ల శివారులో జమ్ముతో నిండుకున్న భీమా కాల్వ.. (ఇలా ఉంటే నీరు పారేదెలా?)



ఈ ఫొటోలో చూస్తున్న నారుమడి గోపాల్‌పేట మండలం చాకలిపల్లి గ్రామానికి చెందిన రైతు మీనేశ్‌బాబుది. ముందుగానే నీళ్లు వస్తాయనుకొని నారు పోసుకున్నారు. నెలరోజులు దాటి పోయింది. ఈ నారుతో నాటినా పంట దిగుబడి రాదు. లాభం లేదనుకొని మళ్లీ రెండో దఫా వరి నారు పోసుకొని నాటుతున్నాడు. తనకున్న నాలుగు బోర్లలో ఒక్క బోరు మాత్రమే అంతంతగా నీరు పోస్తున్నది. ఇది చాలక డీ-8 కెనాల్ నుంచి ప్రత్యేకంగా లైన్ వేసుకుని తనకున్న రెండెకరాల్లో వరి నాటుతున్నాడు.

# నీరుగార్చేలా?

- ఎంజీకేఎల్‌ఐ, భీమా కాల్వల్లో అంతంత మాత్రమే ప్రవాహం
- ముదిరిపోయిన వరి నారు
- కడగండ్లుగా మారిన కాల్వలు
- సరిపడా సాగునీళ్లు కరువు
- ఐదేండ్లుగా ఏడాదికి 2.33 లక్షలకు తగ్గని సాగు
- ప్రస్తుతం వనపర్తి జిల్లాలో జలగండం
- అయోమయంలో కర్షకులు

వనపర్తి, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : కేఎల్‌ఐ, భీమా ఎత్తిపోతల పథకాల కింద నీటి విడుదల కొనసాగుతున్నా.. రైతులు ఆశించిన స్థాయిలో నీళ్లు అందడం లేదనే నిరాశలో ఉన్నారు. ప్రాజెక్టుల కింద సాగు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నచందంగా మారింది. వారం రోజులకు పైబడి కేఎల్‌ఐ, భీమా నీళ్లు విడుదల చేసినా కాల్వల్లో నీటి పారుదల మాత్రం వేగంగా ముందుకు సాగడం లేదు. జిల్లాలో ప్రధానంగా సింహభాగం కేఎల్‌ఐ నీటి ద్వారా సాగుబడులుంటాయి. జూరాలతోపాటు భీమా ఫేస్-1, 2 కూడా జిల్లా రైతులకు సాగునీటిని అందిస్తాయి. కేఎల్‌ఐ ద్వారా 93,366 ఎకరాలు, భీమా ద్వారా 69,669 ఎకరాలు, ఇక జూరాల ఎడమ కాల్వ నుంచి మరో 69,975 ఎకరాలకు సాగునీరు అందుతున్నట్లు అధికారిక లెక్కలున్నాయి. మొత్తం మూడు ప్రాజెక్టులతో 2లక్షల 33వేల 10ఎకరాలకు గడిచిన ఐదారేండ్లలో జిల్లాలో సాగునీరు అందింది. అయితే, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాలు కూడా ప్రాజెక్టుల కింద సాగుకు నోచుకోలేదంటే నీటి పారుదల ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతున్నది.

***ముందుకు సాగని కాల్వలు..***

ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నా కాల్వల్లో నీళ్లు మాత్రం అనుకున్నమేర ముందుకు సాగడం లేదు. నెమ్మదిగా వెళ్తుండడం వల్ల కిలోమీటర్ల మేర పయనించాల్సిన నీరు తక్కువ దూరం వరకు చేరుకుంటున్నది. కాల్వల్లో ఏపుగా పెరిగిన జమ్ము, పూడికలు వెరసి తీవ్రమైన ఎండల ప్రభావం కూడా కాల్వల్లో నీటి ప్రవాహం మందగించేందుకు దోహదమవుతున్నది. మరో వారం గడిస్తే ఆగస్టు కూడా ముగుస్తుంది. కాల్వలకు నీళ్లు మాత్రం సమృద్ధిగా రాకపోవడంతో సాగు సందిగ్ధంలో పడినట్లయ్యింది. రైతులు తికమకపడుతున్నారు. మూడు రోజుల కిందట శ్రీరంగాపురం రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన బీమా నీళ్లు శుక్రవారం నాటికి పుల్గర్‌చెర్ల, కల్వరాల మీదుగా వీపనగండ్ల వరకు మాత్రమే చేరుకున్నాయి. ఇంకా ముందున్న 10 గ్రామాలకకు కాల్వ నీరు చేరాల్సి ఉన్నది.

***చెరువులు నిండేనా..?***

కేఎల్‌ఐ, బీమా ఎత్తిపోతల పథకాల కింద ఉన్న చెరువులు ఈ సీజన్‌లో నిండుతాయా లేదా అన్న అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కేవలం ఎత్తిపోతల నుంచే చెరువులు నిండడం కష్టమేనన్న వాదనలున్నాయి. వర్షాల ప్రభావం లేకపోగా, ఎండల పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈక్రమంలో చెరువుల నిండా నీరు చేరడంపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. నీటిని సైతం ముందు కాల్వలను అనుసరించి ఉన్న పంటలకు తొలి ప్రాధాన్యంగా అధికారులు భావిస్తున్నారు. పంటలకు నీరందించిన తర్వాతే చెరువులకు వదలాలన్న యత్నంలో ఉన్నారు. ప్రధానంగా ఈ పరిస్థితి బీమా కింద కనిపిస్తున్నది. కేఎల్‌ఐ కింద కొన్ని చెరువుల ఆధారంగానే అధికంగా పారుదల సాగుతున్నది. గొలుసుకట్టు చెరువులు వరుసగా ఉండటం వల్ల ఇవి నిండితేనే మరొక చెరువుకు నీటి విడుదల సాగుతుంది. జిల్లాలో రెండు ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 330 చెరువులున్నాయి. వీటిలో కనీసం 30 చెరువల్లో కూడా నీటి తొణికిసలు కానరావడం లేదు.



పాన్‌గల్ మండలం దావాజీపల్లి సమీపంలో ఇంకా నీరందని డీ-8లోని ఎంజే-4 కాల్వ

### సాగునీరు తీసుకువచ్చే బాధ్యత ఎమ్మెల్యేదే..



గతేడాది వరకు పుష్కలంగా నీళ్లు వచ్చిన కేఎల్‌ఐ కాల్వలో ఇప్పుడు ఎందుకు నీరు రావడం లేదు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ నిండి సముద్రంలో కలుస్తుంటే.. మరి ఎందుకు 29వ కాల్వకు సాగునీరు రావడం లేదు. నిజం చెప్పాలంటే ప్రాజెక్టు నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.షట్టర్లు ఊడబెరికి ఎగువన ఉన్న ప్రజాప్రతినిధులు నీళ్లు మళ్లించుకుపోతుంటే.. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల్లో కనీస చలనం లేదు. నీళ్లు వదిలి 20 రోజుల దాటుతున్న కల్వకుర్తి టెయిల్ ఎండ్ జంగారెడ్డిపల్లి వరకు నీరు రాలేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే కల్వకుర్తి కరువుకుర్తిగా మారుతుంది. కచ్చితంగా ఈ ప్రాంత ఎమ్మెల్యే కాల్వ గుండా ఎగువ ప్రాంతం వరకు వెళ్లాలి. సమస్యలను పరిష్కరిస్తూ టెయిల్ ఎండ్ (చివరి ఆయకట్టు) వరకు సాగునీటిని తీసుకువచ్చేందుకు కృషి చేయాలి. లేకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం.

*- బండెల రాంచంద్రారెడ్డి, కేఎల్‌ఐ రైతు, కల్వకుర్తి*



కల్వకుర్తి సమీపంలో 29వ ప్యాకేజీ ఎంజీకేఎల్‌ఐ ప్రధాన కాల్వలో అట్టడుగున పారుతున్న నీరు

## పేరుకు పెద్ద.. సాగుకు దెబ్బ

- ప్రశ్నార్థకంగా ఎంజీకేఎల్‌ఐ చివరి ఆయకట్టు
- కాల్వలో కేవలం అడుగుభాగమే ప్రవాహం
- డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు నీళ్లు అందేనా..?
- కృష్ణమ్మ పారుతున్నా.. కానరాని సాగునీరు
- గందరగోళంలో 2.50 లక్షల ఎకరాల భవితవ్యం
- నీళ్లివ్వడంలో విఫలమైన రాష్ట్ర సర్కారు
- సాల్లాలని సాగునీటితో కర్షకుల ఆందోళన

కల్వకుర్తి, ఆగస్టు 16 : ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయనే సామెత కేఎల్‌ఐ సాగునీటి ప్రాజెక్టుకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. గతేడాది సరిగ్గా ఇదే సమయానికి ఎంజీకేఎల్‌ఐకి చెందిన 29వ ప్యాకేజీ కాల్వ కృష్ణా జలాలతో నిండుగా పారితే.. ఇప్పుడు తగ్గిన జలాలతో అడుగుభాగానా అతిభారంగా కదులుతున్నది. కాల్వలో సాగునీరు అడుగు భాగంలోనే పారితే.. చెరువులు, కుంటలు నిండేదెప్పుడు.. పంట పొలాలకు సాగునీరిందించే పిల్ల కాల్వలకు నీళ్లు వచ్చేదెప్పుడు. ఒక పక్క కృష్ణమ్మ పరవళ్లు పెడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి సముద్రంలోకి పరుగులు పెడుతుంటే.. పంట పొలాలకు నీరిచ్చే ప్రధాన కాల్వలకు సమృద్ధిగా సాగునీరు ఎందుకు రావడం లేదన్నదే శేష ప్రశ్న.

***కేఎల్‌ఐ ప్రధాన కాల్వ 29వ ప్యాకేజీ.***

ఎంజీకేఎల్‌ఐ పథకంలో 3 ప్రధాన కాల్వలు ఉన్నాయి. అందులో 29వ ప్యాకేజీ కాల్వ దాదాపు 160 కిలోమీటర్ల మేర ఉంది. గుడిపల్లి గట్టు నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 29వ ప్యాకేజీ కాల్వను ఏర్పాటు చేశారు. జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు 59 కిలోమీటర్ల డీ-82 కాల్వ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించింది. 29వ ప్యాకేజీ కాల్వ ద్వారా నాగిళ్ల వరకు అంటే గుడిపల్లి గట్టు నుంచి నాగిళ్ల వరకు 220 కిలో మీటర్లు నీరు పారాల్సి ఉంటుంది. ఈ ప్యాకేజీ కింద మిగతా కాల్వలు ప్యాకేజీ 28, 30 కన్నా 29వ ప్యాకేజీ కాల్వలో ప్రవహించే నీటి ద్వారా దాదాపు 2.50లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సింది. నాగర్‌కర్నూల్, వనపర్తి, జడ్చర్ల, అచ్చంపేట (వంగూర్, చారకొండ) కల్వకుర్తి నియోజక వర్గాలకు 29వ ప్యాకేజీతో సాగునీరు అందుతుంది. 29వ ప్యాకేజీలో టెయిల్ ఎండ్ ప్రాంతమైన కల్వకుర్తికి పూర్తి స్థాయిలో ఈ సంవత్సరం కాల్వ ద్వారా సాగునీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

***నీరు విడుదలై 20రోజులు దాటినా..***

గుడిపల్లి గట్టు నుంచి కృష్ణా జలాలు 29వ ప్యాకేజీ కాల్వకు విడుదలై 20 రోజులు కావస్తుంది. ఎప్పుడైన నీళ్లు వదిలితే నాలుగైదు రోజుల్లోనే టెయిల్ ఎండ్ ప్రాంతమైన కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు వచ్చేవి. కాల్వలు నీటితో నిండుగా ప్రవహిస్తూ పరవళ్లు తొక్కేవి. కాల్వ ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు చిన్న కుంటల నుంచి పెద్ద చెరువులకు వరకు నింపేవారు. ఇప్పుడు కాల్వల్లోనే నీరు అట్టడుగున వస్తుంది. చెరువులు కాదు కదా మడికి కూడా సాగునీరందే పరిస్థితి లేదు. ఈ దుస్థితి గురించి ఏ ప్రజాప్రతినిధి కూడా పట్టించుకోవడం లేదనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

***ఎగువ నిండితే దిగువ ఎండాల్సిందేనా..?***

ఎగువన ఉన్న వనపర్తి, నాగరకర్నూల్ నిండితే.. దిగువన ఉన్న జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట ఎండాల్సిందేనా.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి ఎప్పుడు రాలేదని రైతులు అంటున్నారు. కష్టమో, నష్టమో అన్ని ప్రాంతాల రైతులకు సాగునీటి విషయంలో మేలు జరిగిందని, ఇప్పుడు మాత్రం టెయిల్ ఎండ్‌ను ఎండబెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల రూపకల్పనలో లేని వనపర్తి జిల్లాకు కొత్తగా ఆయకట్టు స్థిరికరించినప్పటికీ.. కల్వకుర్తి ప్రాంత రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా కేసీఆర్ ప్రభుత్వం పనిచేసిందని రైతులు గుర్తు చేశారు. ఇప్పుడు వనపర్తికి చెందిన ప్రజాప్రతినిధులు తమకే పెద్ద పేరు రావాలన్న రీతిలో వ్యవహరిస్తూ ప్రధాన కాల్వ షట్టర్లు పగులగొట్టి ఆ ప్రాంత రైతులు నీళ్లు మళ్లించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే నీళ్లు చాలా తక్కువగా కాల్వలో వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితి వల్ల కల్వకుర్తి, వంగూర్, వెల్దండ, చారకొండ, ఊర్కొండ మండలాలల్లో దాదాపు 50 నుంచి 70వేల ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందే అవకాశం లేదు.

### కాల్వకు మోటర్లు బిగించడం వల్లనే..

కాల్వకు ఎగువన పెద్ద ఎత్తున కరెంటు మోటర్లు బిగించడం వల్లనే దిగువకు (టెయిల్ ఎండ్) నీళ్లు తక్కువగా వస్తున్నాయి. కల్వకుర్తికి సాగునీరు ఇవ్వడానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. ఈ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం. కాలువకు ఎక్కడ గండ్లు పడకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నాం. కాకపోతే కాల్వకు దాదాపు 30వేల కరెంట్ మోటర్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. వచ్చిన నీళ్లను వచ్చినట్లు మోటర్లు లాగి పడేస్తుంటే కిందకు నీళ్లు రావడం కష్టమవుతుంది. ఏదేమైనా టెయిల్‌ఎండ్ ప్రాంతానికి సాగునీరు ఇచ్చే విధంగా కృషి చేస్తాం.

*- శ్రీకాంత్, ఈఈ, ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టు (29వ ప్యాకేజీ)*



## కొత్తకొత్తగా సబ్‌స్టేషన్లు

- పాలమూరు జిల్లాకు 14 మంజూరు
- రూ.42 కోట్ల నిధులతో నిర్మాణాలు
- ఒక్కో స్టేషన్‌కు రూ.3 కోట్ల వరకు..
- జీఐ సర్వేతో కరెంట్ సమస్యల పరిష్కారానికి రూ.23 లక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 16 : మహబూబ్‌నగర్ జిల్లాకు కొత్తగా 14 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అరికట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో కొత్తగా 14 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఈ పీవీ.రమేశ్ తెలిపారు. మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి 14 సబ్‌స్టేషన్లకు రూ.42 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

**సబ్‌స్టేషన్ల ఏర్పాటు ఇలా..**

మన్యంకొండ, మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల, పాలమూరు విశ్వవిద్యాలయం, భగీరథ కాలనీ, హన్వాడ మండలంలోని బుద్ధారం, ఎనిమిదితండా, గండీడ్, రంగారెడ్డిగూడ (రాజాపూర్), నందారం, నెరెళ్లపల్లి (బాలానగర్), నసరుల్లాబాద్ (జడ్చర్ల), జడ్చర్ల క్లబ్‌రోడ్, బోయిన్‌పల్లి (మిడ్జిల్), కోయిల్‌సాగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

**11 చోట్ల స్థలాల గుర్తింపు**

జిల్లాలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికిగానూ ఇప్పటికే 11 చోట్ల స్థలాల గుర్తింపు, సేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. మిగిలిన మూడు చోట్ల త్వరలో గుర్తించి సేకరిస్తామన్నారు. త్వరలో వీటన్నింటికీ టెండర్లు పిలవనున్నట్లు ఆ విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు.

**సమస్యల పరిష్కారానికి రూ.23 లక్షలు**

జిల్లా కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి టీజీఎస్పీడీసీఎల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పలు వార్డులు, ప్రాంతాల్లో విద్యుత్ శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏఈ, ఏడీ, డీఈ, ఎస్ఈ పర్యటించారు. జిల్లా కేంద్రంలో గతంలో చేపట్టిన జీఐ సర్వే ఆధారంగా గుర్తించిన ఆయా సమస్యలతోపాటు కొత్తవాటిని గుర్తిస్తున్నారు. ఇందుకుగానూ టీజీఎస్పీడీసీఎల్ నుంచి రూ.23 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

**ఏఏ పనులు చేస్తారంటే..?**

విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందా..? ఓవర్ లోడ్‌తో లోవోల్టేజీ వస్తుందా..? తీగలు వదులుగా ఉండి తాకే విధంగా ఉన్నాయా..? ఇలా సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ చేపట్టిన సర్వేకు అనుగుణంగా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. జిల్లా కేంద్రంలో శిథిలావస్థ, వంగిన, ప్రమాదకరంగా మారిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు, వదులుగా ఉన్న తీగలు, కాలనీకి లోవోల్టేజీ వస్తుంటే ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది వేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఇంటింటికీ తిరిగి మీటర్లు పనిచేస్తున్నాయా.? లేదా..? అధిక బిల్లులు, కరెంట్ బిల్లు చెల్లించేందుకు ఆన్‌లైన్ చెల్లింపులు తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. వార్డుల్లో సమస్యలను నమోదు చేసుకుని అక్కడే ఉన్న సిబ్బందితో సరి చేయటం, పెద్ద పని అయితే గుత్తేదారుతో చేసేలా ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

**అధికారులకు ప్రత్యేక బాధ్యతలు**

మహబూబ్‌నగర్ పట్టణంలోని అన్ని వార్డుల్లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పర్యవేక్షణకు జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో పని చేసే అధికారులకు నోడల్ అధికారులుగా బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలోనే అధికారులు సమస్యలను గుర్తించేందుకు వీధుల్లో పర్యటిస్తున్నారు. సమస్యలను నమోదు చేసుకున్న తర్వాత సత్వరం చేసే పనులు పూర్తి చేస్తున్నారు.



పాలమూరులో పర్యటిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

### పాలమూరు వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఏఈ, ఏడీ, డీఈలకు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించాం. నేను కూడా పర్యవేక్షిస్తున్నాను. పట్టణవాసులు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాకు కొత్తగా 14 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. రూ.42 కోట్ల నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నాం.



**- పీవీ.రమేశ్, ఎస్ఈ, టీజీఎస్పీడీసీఎల్, మహబూబ్‌నగర్**


